రుణమాఫీ చేయండి

మంత్రి శ్రీధర్‌బాబుకు రైతుల వినతి



మంత్రి శ్రీధర్‌బాబుతో ఎమ్మెల్యే మల్లారెడ్డి, రైతులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టిన రైతులు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబును ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రైతుల రుణమాఫీపై మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ రుణమాఫీ విషయమై ఆర్థిక శాఖ మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న కమిషనర్, మున్సిపల్ సిబ్బంది

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మహిళలకు బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు క్మినగర్‌లోని బస్తీ దవాఖానా వద్ద ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో మున్సిపల్ మహిళా పారిశుద్ధ్య కార్మికులకు కేన్సర్స్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వెంకటగోపాల్, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, వైద్యురాలు ప్రజ్ఞ, అధికారులు, వైద్యులు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో చోరీకి యత్నం

ఘట్‌కేసర్: అవుషాపూర్ మనోరూప వెంచర్‌లోని పోచమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మనోరూప వెంచర్‌లోని పోచమ్మ ఆలయంలో పూజారి వీరేశం ఈ నెల 15న పూజలు ముగించుకుని ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లగా ఆలయ తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని వస్తువులు ఎత్తుకెళ్లే ప్రయత్నం చేసినట్లు గుర్తించిన అతను పోలీసులకు సమాచారం అందించాడు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



బొంతు అనిల్‌కుమార్

ఘట్‌కేసర్: పని కోసం ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలాజీనగర్‌కు చెందిన బొంత అనిల్‌కుమార్ (32) మైసమ్మగుట్ట వద్ద రాళ్లు కొట్టుకొని జీవనం సాగించేవాడు. ఈ నెల 21న ఉదయం రాళ్లు కొట్టేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. పని పూర్తి కాగానే అదే రోజు మధ్యాహ్నం కాంట్రాక్టర్ అతడిని స్థానిక భారత్ పెట్రోల్ బంక్ వద్ద వదిలి వెళ్లిపోయాడు. అయితే అనిల్ కుమార్ ఇంటికి చేరుకోలేదు. అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో అతడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుగకు బస్సు చార్జీల పెంపును విరమించుకోవాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నేతలు

బోడుప్పల్: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ 50 శాతం చార్జీలను పెంచాలని చేసిన ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఉప్పల్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పల్ డిపో, చెంగిచర్ల డిపో మేనేజర్లకు వినతిపత్రం అందజేశారు. దసరా పండుగకు ఛార్జీలు పెంచడం సరికాదని ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ పండుగకు పల్లె ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఎక్కువగా ఉంటారని, వారిపై భారం పడుతుందని వినతిపత్రంలో కోరారు. సానుకూలంగా స్పందించిన డీఎంలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఉప్పల్‌శాఖ అధ్యక్షుడు ఎంఎస్ రమేష్‌నాయుడు, కార్యదర్శి రమేష్‌రెడ్డి విభాగ్ సహకార్యదర్శి రాఘవేంద్రరావు, సునీల్‌నాయక్ పాల్గొన్నారు.

ఏమి సాధించారో.!

అసంపూర్తి రోడ్డులో వెలిసిన దుకాణాలు | సగం విస్తరణతో చేకూరని ప్రయోజనం



విస్తరణ చేసి వదిలేసిన రోడ్డు

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐ వద్ద జాతీయ రహదారి నుంచి బాలాజీ నగర్ వరకు వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిందని ఇరుకు రోడ్డును విస్తరణ చేస్తామని మున్సిపాలిటీ చేపట్టిన విస్తరణ కార్యక్రమం సగంలోనే నిలిచిపోయింది. జాతీయ రహదారి నుంచి కోర్టు, బాలాజీనగర్, కేఎల్ఆర్ నగర్, రాఘవేంద్రనగర్‌ల మీదుగా అత్వెల్లి శాంతాబయోటెక్ వరకు మున్సిపల్ రోడ్డు సింగిల్ రోడ్డు ఉండేది. కాలనీలు పెరగడంతో రాకపోకలు పెరిగి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. శాంతాబయోటెక్ (మూతపడ్డ) కంపెనీకి వెళ్లే బస్సులు, ఇతర వాహనాల సంఖ్య పెరగడంతో రోడ్డు విస్తరణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఐటీఐ ఉండటంతో మున్సిపల్ అధికారులు రెండేళ్ల క్రితం ఐటీఐ ప్రహరీని కూల్చి దాదాపు అరెకరం స్థలం తీసుకుని తిరిగి ప్రహరీని నిర్మించారు. దీంతో కోర్టు చివరి వరకు రోడ్డు విస్తరణగా మారింది. రోడ్డు విస్తరణ పనులను నాటి మంత్రులు మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు.

◆ కాలనీలకు అందమైన రోడ్డు వేస్తామని చెప్పిన నాటి అమాత్యుల మాటలు నీటిమూటలుగానే మిగిలియాయి. ప్రభుత్వం మారి రెండేళ్లు గడిచినా రోడ్డు విస్తరణ కార్యక్రమ ప్రారంభం నాడు రోడ్డు ఎలా ఉందో అలాగే ఉంది. ఐటీఐ స్థలం ఎక్కడి వరకు వరకు ఉందో అక్కడి వరకు గోడలను ధ్వంసం చేసి మట్టిని నేర్పి కంకర పోసి వదిలేశారు. బాలజీనగర్‌లో రోడ్డు విస్తరణ చేస్తారా? లేదా అన్న విషయం మున్సిపల్ అధికారులు స్పష్టం చేయకపోవడంతో రోడ్డు విస్తరణ ఉంటుందా లేదా అనే మీమాంసలో బాలజీనగర్ రోడ్డు పక్క ఉన్న ఇళ్లు ఉన్న వారు బిక్కుబిక్కుమంటున్నారు.

పార్కింగ్‌కు, చిరువ్యాపారాలకు అడ్డాగా ..

కోర్టు ముందు మాత్రమే విస్తరణ చేయడంతో కోర్టుకు వచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంది. కోర్టుకు వచ్చే వారు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారికి వెడుల్పు చేసిన రోడ్డు పార్కింగ్‌కు అడ్డాగా మారింది.జాతీయ రహదారి పక్కనే విస్తరించిన రోడ్డు ఉండటంతో అక్కడ చిరు వ్యాపారాలు వెలిశాయి. కొబ్బరి బోండాల దుకాణాలు, మొబైల్ టిఫిన్ సెంటర్‌లను ఇతర చిరు వ్యాపారాలు వెలిశాయి.

◆ ఐటీఐ ప్రహరీ కూల్చి ఐటీఐ స్థలంలో రోడ్డు వేసి విస్తరణ పనులు పూర్తి చేయకపోవడంతో అధికారులు ఏం సాధించారో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు విస్తరణ అవసరం ఉన్నప్పటికీ కొద్ది మేర విస్తరణ చేసి కనీసం రోడ్డు నిర్మించకుండా వదిలేయడంలో అంతర్యమేమిటో అధికారులకే తెలియాలి. మున్సిపల్ అధికారులు రోడ్డుపై దృష్టి సారించి ఉన్న రోడ్డును విస్తరణ చేస్తే చాలా కాలనీలకు రోడ్డు సమస్యతో పాటు రద్దీ సమస్య తీరుతుంది.

కోర్టు రోడ్డు విస్తరించాలి..



ఎన్నో కాలనీలకు గ్రామాలకు వెళ్లే కోర్టు రోడ్డును విస్తరణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కోర్టు కింది భాగాన ఉన్న కాలనీలు, కేఎల్ఆర్ వెంచర్‌కు, జయదర్శిని కాలనీలు, అత్వెల్లి కాలనీలు, రావల్‌కోల్ వంటి గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు ఎంతో పయోగకరంగా ఉంది. రోడ్డును విస్తరణ చేసి అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మున్సిపాలిటీదే. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన రోడ్డు విస్తరణను పూర్తి చేయాలి.

– ప్రేందాస్, స్థానికుడు

విస్తరిస్తే సమస్య తీరుతుంది..



జాతీయ రహదారి నుంచి కోర్టు దిగువ ఉన్న బాలాజీనగర్, కెఎల్ఆర్‌నగర్, రాఘవేంద్రనగర్, జయదర్శిణి, అత్వెల్లి, రావల్‌కోల్ శివారు వరకు ఉన్న కాలనీలలో నివాసాలు పెరగడంతో రద్దీ పెరిగింది. రద్దీకి అనుగుణంగా రోడ్డు ఉండాల్సిన అవసరం ఉంది. మున్సిపల్ అధికారులు కోర్టు నుంచి జయశంకర్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ చేస్తే అన్ని కాలనీల సమస్య తీరుతుంది. మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని కాలనీల వాసులు కోరుతున్నారు.

– రాకేష్, స్థానికుడు

చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలి

అదనపు కలెక్టర్ రాధికా గుప్తా...



అలియాబాద్ అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట్: చిన్నారులకు రుచితో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. పోషన్ భీ పడాయి భీ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... చిన్నారులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని, అంతేకాకుండా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. వంట గదితో పాటు సామాగ్రిని పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అధికారి శారద, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో హరితహారం కింద నాటిన చెట్లను నరికివేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మండల సీపీఎం కార్యదర్శి నరేష్ అన్నారు. స్థానిక కెఎల్ఆర్ వెంచర్‌లో హరితహారం కింద నాటిన చెట్లను కొందరు వ్యక్తులు నరికివేసి అమ్ముకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి కి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ హరితహరంలో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా ఎదిగాయని వాటిని కొంతమంది అమ్ముకుని సొమ్ము చేసుకున్నారన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంతో సీపీఎం నాయకులు పూజ, రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



రిలే నిరహార దీక్షలో పాల్గొన్న రైతులు

ఘట్‌కేసర్: రైతు రుణమాఫీ సాధన సమితి అధ్యక్షుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో రుణమాఫీ కోసం ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 14వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం రుణమాఫీ చేసేంత వరకు రిలే నిరాహార దీక్షలు ఆపేది లేదని నినాదాలు చేశారు. మహిపాల్‌రెడ్డి, నగేశ్‌కుమార్, జైపాల్ రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మురళి, శ్రీనివాస్‌రెడ్డి,భూపాల్‌రెడ్డి దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ పోచిరెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, రమేశ్, రవిశంకర్, సురేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, ఐలయ్యాయాదవ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, శరత్‌గుప్త, గోపిగుప్త, విశ్వనాథం గుప్తా, సంజీవరెడ్డి సంఘీభావం తెలిపారు.

'మెడిసిటీ' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీ బస్టాండ్ వద్ద మంగళవారం మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, కంటి, చెవి, ముక్కు, గొంతు, వరిబీజం, బీజకుట్టు, గడ్డలు, థైరాయిడ్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, ఊపిరితిత్తుల సమస్యలకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ర్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రెడ్డి, వైద్యులు సుధీర్, లహరిక, నేహా, రాందాస్, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, నాగార్జున, సునీల్, మార్కెట్ కమిటీ మెంబర్ శ్వేత, దుర్గ, కాలనీ అధ్యక్షులు రాములు, మాజీ కౌన్సిలర్ వెంకటేష్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని పట్టణ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డికి వినతి తప్రం అందజేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, గోదావరి జలాలు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ పాలకుల వైఫల్యంతో పట్టణంలో తరచూ మంచినీటి సమస్య ఏర్పడుతుందన్నారు. సమస్యకు శాశ్వత పరిస్కారం చూపాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శైలజ, ప్రభాకర్‌రెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిషన్‌రావు, మురళీధర్ గుప్తా, ప్రేందాస్, వంశీవిజయ్, శ్రీకాంత్, రాజు, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆత్మీయతకు ప్రతీక

కలెక్టరేట్‌లో పూల పండుగ సంబురాలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో జిల్లా యంత్రాంగం తరఫున మంగళవారం జిల్లా పంచాయతీరాజ్, ఉద్యానవన, తూనికలు కొలతలు, కార్మిక, హౌజ్ కీపింగ్ ఆధ్వర్యంలో బతుకమ్మ బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.'బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక నిలుస్తుందని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాధిక అన్నారు. కేవలం పూల పండుగ మాత్రమే కాదని, మహిళా సాధికారతకు, సమాజంలో వారి పాత్రకు ప్రతీక అన్నారు.బతుకమ్మ ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు సూచికగా నిలుస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి స్ఫూరించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. కార్యక్రమంలో వివిధ శాఖల మహిళా అధికారులు , ఉద్యోగులు, కలెక్టరేట్ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యూకేషన్ (ఏఐసీటీఈ) సౌజన్యంతో నిర్వహించనున్న మైక్రోప్లాస్టిక్ యాస్ ఎమర్జింగ్ కాంటామినెంట్స్, ఛాలెంజస్ ఇన్ మానిటరింగ్, శాంప్లింగ్ అండ్ ఎనాలిసిస్‌పై ఈ నెల 29వ వరకు జరుగనున్న ఆన్‌లైన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోఆర్డినేటర్ సరస్వతి, కో కోఆర్డినేటర్ నాగేందర్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సెయింట్ పీటర్స్‌లో డ్రోన్ వర్క్‌షాప్

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రోన్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై సిద్ధాంత బోధన, క్విజ్, పిచింగ్ వంటి పోటీలతో పాటు ప్రాక్టికల్ హ్యాండ్స్ ఆన్ సెషన్‌లో విద్యార్థులు డ్రోన్లు తయారు చేసి వాటిని పరీక్షించారు. అనంతరం డ్రోన్ రేస్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజా రెడ్డి, ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, ఈసీఈ హెడ్ ప్రసన్నకుమార్, పీఆర్వో రవిసుధాకర్, కోఆర్డినేటర్ హంసరాణి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్న అధికారులు



రోడ్డు తవ్వకాలను నిలిపివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పోచారం: యంనంపేట్, గాంధీనగర్‌లోని 50 అడుగుల మట్టి రోడ్డులో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేసేందుకు ఓ ప్రైవేట్ టెలీ కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన ఉద్యోగులు తవ్వకాలు చేపట్టారు. పోచారం మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా తవ్వకాలు చేపట్టడంతో మున్సిపల్ సిబ్బంది మంగళవారం పనులను అడ్డుకున్నారు. కేబుల్ వేసేందుకు తవ్విన గుంతలను వెంటనే పూడ్చాలని మున్సిపల్ సిబ్బందిని కమిషనర్ నిత్యానంద్ ఆదేశించారు. సర్వే నెంబర్ 90, ప్లాట్ నెంబర్ 7లో నిర్మించిన భవనంపై సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని, నివాస ప్రాంతంలో టవర్లకు అనుమతులు మంజూరు చేయవద్దని మున్సిపల్ కమిషనర్‌ను కోరుతూ ఈ నెల 13న యంనంపేటకు చెందిన దొంతులపల్లి చెన్నారెడ్డి వినతిపత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు. అయినప్పటికీ టవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెన్నారెడ్డి ఆరోపించారు.

ఉపాధ్యాయులను నియమించండి



ఎంఈఓకు సమస్యను వివరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని అక్బార్జాపేట్ లో సింగిల్ టీచర్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాలకు మరో టీచర్‌ను కేటాయించాలని డీవైఎఫ్ఐ నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంఈఓ శంకరయ్యను కలిసి సమస్యను వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒకే టీచర్ ఉన్నారని, అతనే హెడ్మాస్టర్ బాధ్యతలు నిర్వహిస్తుంటడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో టీచర్ ను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రాము,నర్సింగ్‌రావు, వీరేష్,నర్సింహ్మాచారి తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎస్ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్



చీర్యాలలో శివాలయం వద్ద శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కీసర: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల (జాతీయ సేవా పథకం) ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం చీర్యాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శివాలయం పరిసరాల్లో ముళ్ల చెట్లు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–2 అధికారి డాక్టర్ ఎల్. మహేష్, సీపీఎల్.నర్సింహరావు, కుమార్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న సినీ నటి జీవిత రాజశేఖర్

విజయ దశమిని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు రెండో రోజు భవానీ మాత అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గడిమైసమ్మ ఆలయంలో అమ్మవారు లలితా పరమేశ్వరిగా, గాయత్రీ పీఠంలో గాయత్రీ దేవిగా దర్శనం ఇచ్చారు. పలు ఆలయాలు, మండపాల్లో అమ్మవారికి అర్చనలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

– మేడ్చల్ జోన్ బృందం



కీసరగుట్టలో..



గడి మైసమ్మ ఆలయంలో..



అన్నోజిగూడలో..



ఎన్ఎఫ్‌సీనగర్‌లో..